సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 10, ఏప్రిల్, 2024




స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి 8లో

విశాఖ నగరంలో కనకమహాలక్ష్మి అమ్మ వారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు.



బ్యాంకాక్‌కు విమాన సర్వీసులు పునఃప్రారంభం 8లో

ఎయిర్ ఆసియా విమానయాన సంస్థ బ్యాంకాక్‌కు సర్వీసును పునఃప్రారంభించింది



న్యూస్‌రీల్

నేటి నుంచి గండిపోశమ్మ అమ్మవారి ఉత్సవాలు



దేవీపట్నం: మండలంలోని గండిపోశమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం వరకు నిర్వహించే ఈ జాతరలో ప్రతీరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు గరగల నృత్యాలు, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఈవో జి.లక్ష్మికుమార్ తెలిపారు. పోశమ్మ గండి వద్ద గోదావరి ప్రమాదకరంగా ఉండడంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు గోదావరిలో స్నానాలు నిషేధించినట్టు చెప్పారు. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, క్యూలైన్లు, తాగునీటి సదుపాయం ఏర్పాటుచేశామన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

- ఆ పార్టీ లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీమోహన్



అరకులోయ టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు పట్నాయికుల మురళీ మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంను చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. పార్టీ లీగల్ సెల్ తరఫున తమ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజ రాణి, పాడేరు, అరకు, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం, నాగులపల్లి ధనలక్ష్మిని గెలిపించాలని ఆయన కోరారు. పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోష్యా బుజ్జిబాబు పాల్గొన్నారు.

మోదమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నర్సింగరావు, సర్పంచ్, కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లి ఉత్సవాల ప్రచార పోస్టర్‌ను మంగళవారం ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ నర్సింగరావు,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము ఆవిష్కరించారు. ముందుగా అమ్మవారికి వారు ప్రత్యేక పూజలు చేశారు. వచ్చేనెల 19, 20, 21తేదీల్లో ఉత్సవాలు జరుగుతాయని వారు తెలిపారు. ఐటీడీఏ పీవో అభిషేక్, సినీనటులు ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం,ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుళ్లి రామారావు,యాదగిరి శ్రీను,వెంకటరమణ, ఇతర ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు, వర్తక సంఘం నేతలు పాల్గొన్నారు.

ఉచిత హిందీ శిక్షణ తరగతులు ప్రారంభం

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ ఏడాది సెప్టెంబరులో జరగనున్న హిందీ లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులను ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మంగళవారం ప్రారంభించారు. పరిచయ్, ప్రాథమిక, మాధ్యమిక, ప్రవేశిక, రాష్ట్ర భాష, రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ, రాష్ట్ర భాష విశారద ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ ఉత్తరార్ధ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ ఉచిత శిక్షణ తరగతులు వినియోగించుకోవాలని కోరారు. ఆదివారం, ఇతర సెలవు దినాల్లో ఉచిత శిక్షణ తరగతులు భీమిలిలో నిర్వహిస్తామన్నారు. జాతీయ భాష హిందీని పలువురు నేర్చుకోవడం, మరికొందరికి సిఫారసు చేయడం ద్వారా జాతీయ సమైక్యతకు దోహదపడాలని కోరారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.

జంప్ జిలానీలకు రాజపూజ్యం
నమ్ముకున్నోళ్లకు అవమానం

- అధినేతల దెబ్బకు ఆశావహులు అబ్బా
- ఏళ్ల తరబడి టీడీపీ, జనసేనలకు చాకిరీ
- తీరా ఎన్నికల వేళ దగా
- ఉగాది పూట ఉసూరుమంటున్న నాయకులు
- తమ భవిష్యత్తుకు గండి కొట్టారంటూ ఆవేదన



సాక్షి, విశాఖపట్నం: జంప్ జిలానీలకు రాజపూజ్యం.. నమ్ముకున్న నేతలకు అవమానం..! ఇది జనసేన, టీడీపీ నాయకులకు ఆ పార్టీల అధినేతలు ఇచ్చిన బహుమానం. ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ, జనసేన పార్టీల కోసం ఏళ్ల తరబడి కొంతమంది నాయకులు పనిచేస్తున్నారు. ఈ ఎన్నికల్లో తమకు టికెట్ కచ్చితంగా వచ్చి తీరుతుందన్న నమ్మకంతో ఉన్నారు. తీరా సీట్ల ఖరారు చేసే సమయం వచ్చేసరికి వీరు అక్కరకు రాకుండా పోయారు. నమ్ముకున్న వారికి కాకుండా నిన్న గాక మొన్న పార్టీలో చేరిన వారికే అవకాశం కల్పించారు. కష్టపడి పనిచేసిన వారిని పక్కన పెట్టేశారు. ఎన్నికల వేళ తమ అధినేతలు కొట్టిన దెబ్బకు వీరంతా అబ్బా అంటున్నారు. ఇలాంటి వారంతా ఉగాది పండుగ వేళ తమ భవిష్యత్తును ఊహించుకుని ఉసూరుమంటున్నారు. తమకు రావలసిన అవకాశాలను పార్టీ ఫిరాయింపుదార్లు తన్నుకుపోయారంటూ ఆవేదన చెందుతున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ల బాధితుల లిస్ట్ పెద్దగానే ఉంది.


- విశాఖ దక్షిణ సీటును ఆ నియోజకవర్గానికి చెందిన సాధిక్, కందుల నాగరాజు, మూగి శ్రీనివాసరావు, టీడీపీ నేత గండి బాబ్జీ, సీతంరాజు సుధాకర్ ఆశించారు. కానీ ఇటీవలే వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలోకి జంప్ చేసిన వంశీకృష్ణ శ్రీనివాస్‌కు కేటాయించారు.
- జనసేనలో పెందుర్తి సీటును ఆశించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారు. తీరా ఆ టికెట్‌ను వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించిన పంచకర్ల రమేష్ బాబుకు ఇచ్చారు. దీంతో షాక్ తిన్న శివశంకర్ పత్తా లేకుండాపోయారు. ఇక టీడీపీలో అదే స్థానంపై గంపెడాశలు పెట్టుకున్న మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి కూడా తీవ్ర అసంతృప్తికి లోనై అనారోగ్యం పాలయ్యారు.
- గాజువాక స్థానంపై నమ్మకం పెట్టుకున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకు కాకుండా పొత్తులో టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు కేటాయించడం ఆయనకు మింగుడు పడలేదు.
- భీమిలిలో పదేళ్ల నుంచి జనసేన కోసం కష్టపడుతున్న పంచకర్ల సందీప్‌కు సీటిస్తామని పవన్ హామీ ఇచ్చారు. కానీ ఆఖరు నిమిషంలో టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కేటాయించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే స్థానాన్ని ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబుకు గట్టిగానే షాక్ తగిలింది.
- విశాఖ ఉత్తర స్థానాన్ని ఆశించిన జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్‌కు కూడా ఆశాభంగమే ఎదురవడంతో ఆమె ఉసూరుమంటున్నారు.
- అనకాపల్లి టికెట్ ఆశించి జనసేన ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న పరచూరి భాస్కరరావుకు ఝలక్ ఇచ్చి.. నిన్నగాక మొన్న చేరిన మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు సీటిచ్చారు. దీంతో పరుచూరి ఆ పార్టీకో నమస్కారం అంటూ రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇదే సీటును ఆశించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ సత్యనారాయణ డీలా పడ్డారు.
- మాడుగుల సీటు కోసం పార్టీలో పనిచేస్తున్న పీవీజీ కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులను కాదని ఎన్ఆర్ఐ పైలా ప్రసాదరావుకు కేటాయించడంతో వీరిద్దరూ తమ అధినేత చంద్రబాబుపై గుర్రుగా ఉన్నారు.
- యలమంచిలి టీడీపీ సీటు తనదేనని ఆశించిన ప్రగడ నాగేశ్వరరావుకు షాకిచ్చి జనసేన సుందరపు విజయకుమార్‌కు కేటాయించారు. దీంతో ప్రగడ తీవ్ర నైరాశ్యంలో ఉన్నారు.

మన్యంలోనూ అంతే..

- అరకు అసెంబ్లీ స్థానాన్ని తొలుత కిడారి శ్రవణ్ కుమార్, సివేరి అబ్రహం ఆశించారు. అయితే వీరిద్దరిని కాదని చంద్రబాబు సియ్యారి దొన్నుదొరకు టికెట్ ప్రకటించారు. ఆయన జోరుగా ప్రచారం చేసుకుంటున్న తరుణంలో షాకిచ్చారు. ఆ సీటును బీజేపీ నేత పాంగి రాజారావుకు కేటాయించారు. అధినేత కొట్టిన దెబ్బకు దొన్నుదొర లబోదిబోమంటున్నారు.
- పాడేరు సీటును మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని కాదని నిన్న గాక మొన్ననే పార్టీ తీర్థం పుచ్చుకున్న రమేష్‌నాయుడుకు ఇచ్చారు. దీంతో గిడ్డి ఈశ్వరి ఇప్పుడు కుయ్యో మొర్రో అంటున్నా వినే వారే లేకుండాపోయారు. ఈ టికెట్‌ను ఆశించిన మత్స్యరాస మణికుమారి, ఎం.వి.వి.ప్రసాద్‌కు హ్యాండ్ ఇచ్చారు.
- రంపచోడవరంలో ఐదేళ్లుగా టీడీపీలో అన్నీ తానై వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరిని పక్కనబెట్టి ఇటీవలే పార్టీలో చేరిన శిరీషకు టికెట్ ఇచ్చారు. తమ నాయకుడు చంద్రబాబు ఇచ్చిన షాక్ నుంచి ఆమె ఇంకా తేరుకోలేదు.
- ఇలా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇటు చంద్రబాబు, అటు పవన్ కల్యాణ్‌లు వారినే నమ్ముకున్న వారిని కాకుండా పార్టీలు ఫిరాయించి వచ్చిన వారికి, డబ్బున్న వారికి పెద్ద పీట వేస్తూ సీట్లిచ్చి తమ భవిష్యత్తుకు గండి కొట్టారంటూ వారు తీవ్రంగా మదన పడుతున్నారు.
- విశాఖ ఎంపీ టికెట్‌ను బీజేపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు ఆశించారు. ఆయన మూడేళ్లుగా విశాఖలోనే ఉంటూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. సీటు తనదేనన్న ధీమాతో ఉన్న తరుణంలో ఆయనను పక్కనబెట్టి టీడీపీకి చెందిన ఎం. శ్రీభరత్‌కు ఇచ్చారు.
- అనకాపల్లి ఎంపీ సీటును ఆశించిన సీనియర్లకు చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. చింతకాయల విజయ్, దిలీప్ చక్రవర్తి పార్టీ టికెట్‌ను ఆశించారు. వీరిని పక్కనబెట్టి ధన బలం ఉన్న కడప జిల్లాకు చెందిన సీఎం రమేష్‌కు ఇవ్వడంతో వారు కంగుతిన్నారు.

కోడ్ ఉల్లంఘించారు.. సంజాయిషీ ఇవ్వండి

- సీఎం రమేష్, అయ్యన్నలకు ఈసీ నోటీసులు



నర్సీపట్నం: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించారని పేర్కొంటూ బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌కు, టీడీపీ నర్సీపట్నం అభ్యర్థి సీహెచ్ అయ్యన్నపాత్రుడికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. ఈనెల 6న నర్సీపట్నం కృష్ణాప్యాలెస్‌లో బీజేపీ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ తోపాటు అయ్యన్నపాత్రుడు హాజరయ్యారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు సీఎం రమేష్ చీరతోపాటు రూ.2 వేలు చొప్పున నగదు పంపిణీ చేశారు. చీరలు, నగదు పంపిణీ చేస్తున్నారన్న ఫిర్యాదుపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేసేందుకు వెళ్లగా సీఐ కాంతికుమార్, పోలీసులతో రమేష్ వాగ్వాదానికి దిగారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, వారిపై చిందులేశారు. చీరలు పంచితే తప్పేమిటని దబాయించారు. కోడ్ ఉల్లంఘించినందున సంజాయిషీ ఇవ్వాలని నర్సీపట్నం నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం సీఎం రమేష్ వాట్సప్‌కు నోటీసు పంపించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు సాక్షాత్తు చీఫ్ సెక్రటరీ, డీజీపీలపై పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న కనీస పరిజ్ఞానం కూడా లేకుండా ఎప్పుడు మాదిరి అధికారులపై తీవ్ర స్థాయిలో రెచ్చిపోయారు. దీంతో ఆయనకు కూడా ఆర్వో జయరాం నోటీసులు జారీ చేశారు.



పాడేరులో మోదకొండమ్మతల్లి దర్శనానికి బారులు తీరిన భక్తులు



ఉమానీలకంఠేశ్వరుని ఆలయంలో పంచాంగం చదివి వినిపిస్తున్న అర్చకులు

ఉగాది శోభ

ఉగాది వేడుకలు జిల్లావ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రంపచోడవరంలో వేంకటేశ్వరస్వామి, పాడేరులో మోదకొండమ్మ ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేడుకల్లో భాగంగా పండితులు, అర్చకులు పంచాంగాన్ని చదివి వినిపించారు. రాశిఫలాలను తెలియజేశారు.



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మతల్లి

సాక్షి,పాడేరు: ఉగాది పండగ సందర్భంగా పాడేరులోని మోదకొండమ్మతల్లిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉగాది పచ్చడి, ప్రసాదం పంపిణీ చేశారు. పట్టణంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

క్రోధి నామ తెలుగు నూతన సంవత్సర (ఉగాది) వేడుకలు మంగళవారం సాయంత్రం స్థానిక ఉమా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగం చదివి వినిపించారు. అర్చకులు శర్మ, సుబ్రహ్మణ్యం, రామం పంతులు తదితరులు రాశి ఫలాలను సమగ్రంగా వివరించారు. ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, ఉప సర్పంచ్ బూరెడ్డి రాము, ఆధ్యాత్మిక కమిటీ ప్రతినిధులు మఠం సూర్యనారాయణ,రాజుబాబు,వర్తక సంఘం నేతలు ఊడా త్రినాధరావు,వెయ్యాకుల సత్యనారాయణ, ఉప్పల వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



టీటీడీ ఆలయంలో ఉగాది వేడుకలు

రంపచోడవరం: ఉగాది పర్వదినం పురస్కరించుకుని భక్తులు ఐ. పోలవరం గోవిందగిరిపై కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం వేడుకలను ఘనంగా నిర్వహించింది. ఉగాది రోజున తిరుమలలో మాదిరిగానే నిత్య పూజా కైంకర్యాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం 9 గంటలకు ఉగాది ఆస్థానం (పంచాంగ శ్రవణం), మధ్యాహ్నం విశేష అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అధికారులు నారాయణరాజు, శివరాంవ వేడుకలను పర్యవేక్షించారు. అర్చకులు మణికంఠ, పార్థశ్రీనివాస్, వేదపండితులు సాయిరాం శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ధర్మప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వేంకట రామారెడ్డి మాట్లాడుతూ దాతలు సమర్పించిన విరాళాలతో పుష్పాలంకరణ, వస్త్ర సమర్పణ, అన్న ప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు.

అందరికీ మేలు చేయాలి

కొయ్యూరు: కొత్త సంవత్సరం అందరికీ మేలు చేయాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి అన్నారు. ఊశరభన్నపాలెంలోని స్వగృహంలో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. నేనుసైతం చారిటబుల్‌సంస్థ వ్యవస్థాపకుడు కె.శివప్రసాద్ ఆధ్వర్యంలో విశాఖకు చెందిన ప్రముఖ జ్యోతిష్య పండితుడు వీర వెంకట సూర్యప్రకాశ్ పంచాంగం చదివి వినిపించారు. రాశుల ఫలితాలను వివరించారు. జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు గొడ్డేటి మహేష్, సర్పంచ్ కిముడు సత్యనారాయణ పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ఎంపీ మాధవి

పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు కీలకం

- ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలు పక్కాగా అమలు
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత ఆదేశం
- పాడేరులో శిక్షణ కార్యక్రమం పరిశీలన



శిక్షణకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయసునీత

పాడేరు : సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులపై ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయసునీత సూచించారు. స్థానిక గురుకుల కళాశాలలో పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలోని పాడేరు, హుకుంపేట మండల ప్రిసైడింగ్ అధికారులను నిర్వహిస్తున్న ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈవీఎంలు, వీవీ పాట్, కంట్రోల్ యూనిట్, 17ఎ రిజిస్టర్ నిర్వహణపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. ఎన్నికల నిర్వహణపై పంపిణీ చేసిన పుస్తకాలను చదివి తెలుసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నింబంధలను పక్కాగా అమలు చేయాలని సూచించారు. జేసీ, పాడేరు అసెంబ్లీ ఆర్వో భావన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ రూపొందించిన మొబైల్ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కేంద్రాల్లో పోలింగ్‌ను రహస్యంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ పీవో, అరకు అసెంబ్లీ ఆర్వోఅభిషేక్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులదే కీలకపాత్ర అన్నారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.చెక్ లిస్ట్, డైరీని పోలింగ్ అధికారి సక్రమంగా నిర్వహించాలన్నారు. సెక్టోరల్ అధికారుల వద్ద రెండు ఈవీఎం పరికరాలను రిజర్వ్‌లో ఉంచుతామని చెప్పారు. ఎక్కడైనా ఈవీఎంలు పని చేయకపోతే వాటిని వెంటనే మార్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శర్మ, తహసీల్దార్లు కళ్యాణ చక్రవర్తి, సోమేశ్వరరావు, మాస్టర్ ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పేరంటాలమ్మ తీర్థం

పాయకరావుపేట: పట్టణంలోని పేరంటాలమ్మ తీర్థం మంగళవారం ఘనంగా జరిగింది. మంగవరం రోడ్డులోని పేరంటాలమ్మ గుడికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి, పసుపు కుంకుమ, పండ్లు, పూలు సమర్పించారు. పక్కనే ఉన్న సీతారామ దేవస్థానాన్ని కూడా దర్శించుకున్నారు. పేరంటాలమ్మ గుడికి హాజరైన భక్తులకు పట్టణానికి చెందిన మలిపెద్ది కుటుంబీకులు సౌకర్యాలు కల్పించారు. సీతారామ దేవస్థానం వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, వానరసేన సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

'12వ మైలురాయి' సందడి



సినిమా షూటింగ్‌ను క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

- పాడేరులో సినిమా చిత్రీకరణ ప్రారంభం
- క్లాప్ కొట్టిన పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- గిరి యువతకు అవకాశం కల్పిస్తాం: దర్శకుడు ఎన్‌కే సాయి

సాక్షి,పాడేరు: పాడేరుకు చెందిన దర్శకుడు ఎన్‌కే సాయి మరో చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. పాడేరు 12వ మైలురాయి టైటిల్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం మంగళవారం పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయంలో ప్రారంభమైంది. ఐటీడీఏ పీవో వి.అభిషేక్, చిత్ర దర్శకుడు, నిర్మాత ఎన్‌కే సాయి, నటులు శ్రావణ్, సుహస్ తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రం షూటింగ్‌ను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు ఎన్‌కే సాయి మాట్లాడుతూ తన స్నేహితుల సహకారంతో శ్రీలక్ష్మి గణపతి మూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామన్నారు. ఈ సినిమాకు సంబంధించి హీరో, ఇతర నటుల వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. ప్రేమ, హర్రర్ అంశాలతో కూడిన ఈ సినిమాలో ఎక్కువ భాగం ఉమ్మడి విశాఖ జిల్లాలోనే చిత్రీకరిస్తామని తెలిపారు. పూర్వం నుంచి పాడేరు ఘాట్‌లోని 12వ మైలురాయికి ఎంతో చరిత్ర ఉందని, అందుకు అనుగుణంగా కథను రూపొందించామన్నారు. గిరిజన ప్రాంత యువకులకు ఈ సినిమాలో అవకాశం కల్పిస్తామన్నారు. క్యారెక్టర్ నటుడు శ్రావణ్ మాట్లాడుతూ మంచి సబ్జెక్ట్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రంలో నటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏజెన్సీలో ప్రకృతి అందాలు, వాతావరణం ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కెమెరామెన్ గోపి, సంగీత దర్శకుడు రాము, చిత్ర నిర్మాణ సహాయకులు గ్రంధి త్రినాథ్, అనంత్, కటారి శ్రీనివాస్, రాజు, లకే శివ పాల్గొన్నారు. ఎన్‌కే సాయి నిర్మించిన తొలి చిత్రం యమునానది విజయవంతమైంది.

నేత్రపర్వం.. అప్పన్న పెళ్లి రాట ఉత్సవం

- దేవస్థానంలో పంచాంగ శ్రవణం
- మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు





రాజగోపురంలోనుంచి పడుతున్న సూర్య కిరణాలు, అశేష భక్తజనుల మధ్య నిర్వహిస్తున్న అప్పన్న పెళ్లి రాట కార్యక్రమం

సింహాచలం: ఉగాది పర్వదిన వేళ సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లి రాట మహోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఈ నెల 19న జరిపించనున్న వార్షిక కల్యాణాన్ని పురస్కరించుకుని పెళ్లిరాట ఉత్సవాన్ని అశేష భక్తజనుల మధ్య మంగళవారం సాయంత్రం సింహాచల దేవస్థానం వైదిక, అధికార వర్గాలు ఘనంగా జరిపించారు.

పెళ్లికొడుకైన అప్పన్న : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పెళ్లి కుమారుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థానమండపంలో కొలువుదీర్చారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. తొలుత దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పంచాంగ పఠనం చేశారు. తదుపరి మహిళలు, ముత్తయిదువలు పసుపు కుంకుమలతో పెళ్లిరాటలను అలంకరించారు. అనంతరం నాదస్వర వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణలు, భక్తుల జేజేల మధ్య ఆలయ ఉత్తరద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే నృసింహ మండపంలో శాస్త్రోక్తంగా పెళ్లిరాటలను వేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ : ఈ నెల 18 నుంచి 24 వరకు జరిగే స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాల ఆహ్వాన పత్రికలను, శ్రీ క్రోధినామ సంవత్సర పంచాంగాలను దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి ఆవిష్కరించారు. ఈ నెల 19 రాత్రి రథోత్సవం, వార్షిక కల్యాణం జరగనున్నాయి.

ఆలయంలో అద్భుత దృశ్యం : ఉగాది వేళ శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి మూలవిరాట్‌పై పడిన సూర్యకిరణాలను చూసి భక్తులు పరవశించారు. ఈ అద్భుత దృశ్యం సాయంత్రం ఆలయంలో చోటుచేసుకుంది. ఏటా ఉగాది రోజు సాయంత్రం స్వామివారి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడటం పరిపాటి. అయితే మూడేళ్ల నుంచి వర్షం, మబ్బుల కారణంగా సూర్య కిరణాలు స్వామిపై పడకపోవడంతో ఆ అవకాశం కలగలేదు. ఈ సారి మాత్రం మంగళవారం సాయంత్రం 5.40 సమయంలో ఆలయ రాజగోపురం నుంచి ఆస్థాన మండపం, భోగమండపం మీదుగా సూర్యకిరణాలు ప్రసరించి అంతరాలయంలో ఉన్న స్వామివారి మూలవిరాట్‌పై పడటంతో ఈ అపురూప దృశ్యాన్ని భక్తులు కనులారా వీక్షించారు. ఈ దృశ్యాన్ని భక్తులు తిలకించేలా ఈవో శ్రీనివాసమూర్తి ఏర్పాట్లు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మ వారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. గణపతి పూజ, మండపారాధన అనంతరం పంచాంగ పఠనం జరిగింది. చారు. ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు వితరణ చేశారు.

బ్యాంకాక్‌కు విమాన సర్వీసులు పునఃప్రారంభం

గోపాలపట్నం: విమాన ప్రయాణికులకు శుభవార్త. వేసవి సీజన్‌లో ఎయిరాసియా విమానయాన సంస్థ బ్యాంకాక్‌కు సర్వీసును బుధవారం పునఃప్రారంభించింది. విమానాశ్రయం టెర్మినల్ భవనంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తొలి ప్రయాణికురాలికి స్వాగతం పలికి టికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ తరువాత బ్యాంకాక్ సర్వీసు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రయాణికులకు ఈ వేసవిలో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ సర్వీసు బుధ, గురు, శని వారాల్లో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. రాత్రి 11.50 గంటలకు విశాఖ నుంచి బయలుదేరి బ్యాంకాక్‌కు 4.15 గంటలకు చేరుకుంటుంది. బ్యాంకాక్ నుంచి రాత్రి 10.05 గంటలకు బయలుదేరి విశాఖకు రాత్రి 12.50 గంటలకు చేరుకుంటుంది.

హైదరాబాద్-కటక్ మధ్య ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్-కటక్-హైదరాబాద్ (వయా దువ్వాడ మీదుగా) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ త్రిపాఠి తెలిపారు. హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ హైదరాబాద్‌లో ఈ నెల 16, 23, 30వ తేదీల్లో (ప్రతీ మంగళవారాల్లో) రాత్రి 8.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ కటక్‌లో ఈ నెల 17, 23, మే 1వ తేదీల్లో (ప్రతీ బుధవారాలలో) రాత్రి 10.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

పర్యాటకం పరుగులు

- రూ. 6.35 కోట్లతో సందర్శిత ప్రాంతాల్లో సౌకర్యాల కల్పన
- జగనన్న ప్రభుత్వంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి
- రూ. 5 కోట్లతో మ్యూజియం ఆధునీకీకరణ పనులు
- రూ. 70.లక్షలతో చాపరాయిలో సౌకర్యాలు
- రూ. 65లక్షలతో పద్మాపురం ఉద్యానవనంలో కాటేజీల నిర్మాణం


అరకులోయలోని గిరిజన మ్యూజియం

అరకులోయటౌన్: మన్యంలో పర్యాటకం పరుగులు తీస్తోంది.. ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఆంధ్రా ఊటీ అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లోని సందర్శిత ప్రాంతాల్లొ రూ. 6.35 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మన్యం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. మన్యంలో పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించింది. గత టీడీపీ ప్రభుత్వ హయంలో మన్య ప్రాంతంలో కనీస అభివృద్ధి పనులు జరగులేదు. సందర్శిత ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు లేక పర్యాటకం కుంటుపడింది. ఇందులో భాగంగా శిథిల దశలో ఉన్న గిరిజన మ్యూజియం, చాపరాయి గెడ్డ ప్రమాద పరిస్థితులను విస్మరించడంతో పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. చాపరాయి వద్ద కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో అనేక మంది మృత్యువాత పడ్డారు. హుదూద్ సమయంలో పద్మాపురం ఉద్యానవనంలో ట్రీహట్స్ శిథిలమైనా పునర్నిర్మించకుండా విడిచిపెట్టారు. 2019లో జగనన్న ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత స్థానికులు, పర్యాటకుల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.5 కోట్లతో మ్యూజియం అభివృద్ధి, రూ.70 లక్షలతో డుంబ్రిగుడ చాపరాయిలో సౌకార్యల కల్పన, రూ. 65 లక్షలతో పద్మాపురం ఉద్యానవనంలో కాటేజీల నిర్మాణం తదితర పనులు చేపట్టి సకాలంలో పనులు పూర్తి చేశారు.

మ్యూజియం అభివృద్ధి

అరకులోయలోని గిరిజన మ్యూజియంలో గడిచిన ఐదేళ్ల కాలంలో జగనన్న ప్రభుత్వం రూ. 5కోట్లతో ఆధునీకీకరణ పనులు చేపట్టింది. గిరిజన సంస్కృతి సంప్రదాయలతో ఉన్న మట్టి ప్రతిమలను తొలగించి, ఫైబర్ బొమ్మలు ఏర్పాటు చేశారు. సాధారణ గ్యాలరీలను తొలగించి గ్లాస్ గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అడ్వంచర్ స్పోర్ట్స్ , జిప్‌లైన్, స్కై సైకిల్, కమాండ్‌నెట్, వాల్ క్లైమ్ బింగ్, మల్టీ వెల్‌రోప్ కోర్సు ఏక్టివిటీ వంటి పనులతో పాటు విద్యుత్ సౌకర్యాల మెరుగు, చిల్డ్రన్ పార్క్, గార్డెన్ అభివృద్ధి, పర్యాటకుల సమాచార కేంద్రం, ముఖద్వారం వద్ద టికెట్ కౌంటర్ చాంబర్ ఏర్పాటు చేశారు. మ్యూజియం వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించి, దుకాణాల ఏర్పాటుతో నిరుద్యోగ గిరిజన యువతకు ప్రభుత్వం ఉపాధి కల్పించింది.

చాపరాయికి సొబగులు

డుంబ్రిగుడ చాపరాయి వద్ద గతంలో ఎన్నడూ లేని విధంగా సౌకర్యాలు కల్పించారు. రూ.70 లక్షలు వెచ్చించి పనులు చేపట్టి గడువుకు ముందే పూర్తి చేశారు. ఎంట్రన్స్ ఆర్చ్‌తోపాటు ముందు భాగంలో ప్రహరీ నిర్మాణం, విద్యుదీకరణ, పాత్‌వేలో టైల్స్ ఫ్లోరింగ్ పనులు చేశారు. చాపరాయి వద్ద డ్రెస్సింగ్ రూమ్‌లు, మరుగుదొడ్లు, థింసా యాంఫీ థియేటర్, లోపల రైలింగ్, గార్డెన్ అభివృద్ధి, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఏర్పాటుచేశారు. చాపరాయి చుట్టూ విద్యుత్ దీపాల ఏర్పాటు చేశారు. దీంతో చాపరాయికి సొబగులతో కొత్త కళ సంతరించుకుందని పర్యాటకులు చెబుతున్నారు.


చాపరాయి వద్ద నిర్మించిన పగోడా గార్డెన్

పద్మాపురం ఉద్యానవనంలో ఆధునికీకరణ పనులు

అరకులోయలోని పద్మాపురం ఉద్యానవనం ఆధునికీకరణ కోసం రూ. 65 లక్షలతో ట్రీ రిసార్ట్స్ , ఆరు గదులు, వెయింటింగ్ హాల్ నిర్మించారు, గదుల్లో దిగిన వారు భోజనాలు చేసేందుకు వీలుగా రిసార్ట్స్ ఎదురుగా 6 పగోడాలు ఏర్పాటు చేసారు. ఈ రిసార్ట్స్‌లో విశాలమైన బెడ్ రూమ్‌లు, టాయిలెట్స్, బాల్కనీ ఏర్పాటు చేసారు. రిసార్ట్స్, పగోడాలు రాత్రి వేళల్లో విద్యుత్ కాంతులతో చూపరులను ఆకట్టుకుంటోంది. గిరిజన ఉత్పత్తుల విక్రయ కేంద్రం, భోజన శాల ఏర్పాటు చేశారు. అరకు నియోజకవర్గంలో పర్యాటక ప్రాంతాల్లో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి, మౌలిక సదుపాయాలు దర్శనమిస్తున్నాయి. పర్యాటక రంగాభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతో నిరుద్యోగులకు ఉపాధి కల్పనతో పాటు మన్య ప్రాంతం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తోంది.


కాటేజీ ఎదురుగా నిర్మించిన పగోడాలు


డుంబ్రిగుడ చాపరాయి ముఖద్వారం


గిరిజన మ్యూజియంలో ఫైబర్ బొమ్మలు


పద్మాపురం ఉద్యానవనంలో నిర్మించిన కాటేజీ

విభిన్న కథాంశంతో 'లవ్‌మౌళి'

సీతమ్మధార: 'లవ్ మౌళి' చిత్రం హీరోగా నాకు మంచి బ్రేక్ ఇస్తుందని నటుడు నవదీప్ అన్నారు. ఆయన హీరోగా పంఖురి గిద్వానీ హీరోయిన్‌గా నటించిన చిత్రం లవ్ మౌళి. ఈ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం శరత్ థియేటర్‌లో సినిమా ట్రైలర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నవదీప్ మాట్లాడుతూ తాను విశాఖ రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ ఎన్నో చిత్రాల షూటింగ్‌లో పాల్గొన్నానని గుర్తు చేశారు. ఈ చిత్రంలో నటించిన భావన విశాఖ అమ్మాయే అని చెప్పారు. తాను ఎంతో ఇష్టంతో చేసిన సినిమా ఇదని, మేఘాలయలో 70 రోజుల పాటు కష్టపడి షూటింగ్ చేశామన్నారు. విభిన్న కథాంశంతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఈ నెల 19న విడుదల అవుతుందన్నారు. న్యూసెన్స్-2 త్వరలోనే సెట్స్‌పైకి వెళ్తుందని వెల్లడించారు. హీరోయిన్ మాట్లాడుతూ ఈ సినిమా అందరికీ నచ్చుతుందన్నారు. ఈ చిత్రం కోసం తెలుగు నేర్చుకున్నట్లు చెప్పారు. నటి భావన మాట్లాడుతూ ఈ సినిమా చేయ డం ఆనందంగా ఉందన్నారు. అనంతరం చిత్ర బృందం ప్రేక్షకులతో ముచ్చటించింది.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన నానాజీ

పాడేరు రూరల్(హుకుంపేట): బొలేరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. హుకుంపేట మండలం ములియపుట్టు పంచాయతీ కంగారుపుట్టు గ్రామానికి చెందిన దంగయితీ నానాజీ (28) మండలంలోని చింతలవీధి భీమసింగి జంక్షన్ వద్ద మంగళవారం రాత్రి కూరగాయలు కొనుగోలుకు వెళ్తున్న సమయంలో పాడేరు వైపు నుంచి వస్తున్న బోలేరో వాహనం ఢీకొనడంతో కిందపడి తలపై బలంగా దెబ్బతగిలి తీవ్ర రక్తస్రావమవడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు స్థానికులు చెప్పారు. విషయం తెలుసున్న ఎస్‌ఐ లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడు తండ్రి, అన్నయ్య గతంలో మృతి చెందారు. నానాజీ మృతితో ఒంటరైన తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తీరు స్థానికులను కంటతడి పెట్టించింది.

జగనన్నకు పట్టం కడదాం

అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం

హుకుంపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసి సుపరిపాలనకు పట్టం కడదామని అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం పిలుపునిచ్చారు. మండలంలోని బాకురు, మెరకచింత, గన్నెరుపుట్టు, జర్రకొండ పంచాయతీ గసరపల్లి, పనసపుట్టు, కరకవలస, గేదేలపాడు, బురుదగుమ్మి గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఉగాది సందర్భంగా కార్యక్రమంలో భాగంగా ముందుగా మండల కేంద్రంలోని మోద కొండమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమైందన్నారు. దశాబ్దాల తరబడి వెనుకబడిన మన్య ప్రాంతాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఊహించని అభివృద్ధి చేసిందన్నారు. వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం అయిన తనను గెలిపించి, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేద్దామని గ్రామస్తులను అభ్యర్థించారు.


గసరపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న అరకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం, నేతలు


మజ్జి మత్స్యరాజును కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యలింగం

సీపీఎం నేత పార్టీలో చేరిక

మండలంలోని గన్నెరుపుట్టు పంచాయతీ వైస్ సర్పంచ్ మజ్జి మత్స్యారాజు (సీపీఎం), నాయకులు మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్యలింగం సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఐదేళ్లు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం, అందించిన సేవలను మెచ్చి పార్టీలో చేరినట్టు చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొండలరావు, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు శోభ ధర్మయ్యదొర, మండల పార్టీ ఉపాధ్యక్షుడు కంబిడి చిన్నబ్బి, సర్పంచ్‌లు సమిడ వెంకటపూర్ణిమ, దూసురు పద్మకుమారి, చిట్టిబాబు, ఎంపీటీసీ సభ్యుడు కిలగడ సింహాచలం, నాయకులు సదాశివరాజు, నైని సత్తిబాబు, జన్ని సింహాచలం, ముసిరి మత్స్యలింగం, వెంకట్, రాజారావు, కామరాజు, మోహన్‌దాసు, సాంబ, పద్మరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

యలమంచిలి రూరల్: మద్యం బాటిళ్లు తరలిస్తున్న నర్సింగబిల్లి గ్రామానికి చెందిన చిందాడ దొరబాబుపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దొరబాబు నుంచి 19 మద్యం బాటిళ్లు స్వాధీన పరచుకున్నామన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నృసింహుడికి విశేష పూజలు

- శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం
- వైభవంగా గరుడసేవ

సింహాచలం: ఉగాది పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 1001నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై గోవిందరాజస్వామిని అధిష్టంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజతో ప్రారంభమైన ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆహుతులైన భక్తుల సమక్షంలో శ్రీమేరు మొదటి అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక మీద కలశ స్థాపన చేశారు.అనంతరం ఉత్సవమూర్తి లలితాంబిక అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ గావించారు.లలితా సహస్రనామ పారాయణ,త్రిశతి,బాలా సహిత లలితా హోమం జరిపించారు. మధాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.


బాల త్రిపురసుందరిగా అమ్మవారు

ఇంగ్లిష్ స్పీకింగ్‌లో ఉచిత శిక్షణ

'మేధా ఇన్‌స్టిట్యూట్' ఫౌండర్ చిరంజీవి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో ప్రాథమిక విద్య నుంచి ఇంగ్లీషు మీడియాన్ని అందుబాటులోకి తేవటం ప్రశంసనీయమని 'మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్' వ్యవస్థాపకుడు, చీఫ్ కోచ్ డాక్టర్ ఎ.చిరంజీవి అభిప్రాయపడ్డారు. విద్య, ఉద్యోగం, వ్యాపారం.. ఇలా ఏ రంగంలోనైనా ఇంగ్లీషుపై పట్టున్న వారికే అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయని చెబుతూ... ఆసక్తి ఉన్నవారి కోసం తమ సంస్థ ఉచితంగా ఇంగ్లీషు స్పీకింగ్ కోర్సును అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలియజేశారు. 'మా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేసి 30 సంవత్సరాలవుతున్న సందర్భంగా ఈజీ ఇంగ్లీష్ కార్యక్రమాన్ని తలపెట్టాం. ఆన్‌లైన్లో ఉచితంగా అందజేస్తాం' అని చెప్పారాయన. ఈజీ ఇంగ్లీష్ ద్వారా స్పోకెన్ ఇంగ్లీష్ మాత్రమే కాకుండా దాదాపు 9 రకాల అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలియజేశారు. ఈ నెల రెండో వారం నుంచి తరగతులు ప్రారంభిస్తామన్నారు. 'ఈ కోర్సుకు ఆసక్తి ఉన్న ఎవరైనా రిజిస్టర్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ కోసం దిగువ ఇచ్చిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసుకుంటే చాలు. వారి మొబైల్‌కు రిజిస్ట్రేషన్ లింకు వస్తుంది. లేనిపక్షంలో 9866006662 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా వివరాలు పంపినా వారి మొబైల్ ఫోన్‌కు లింకును పంపిస్తాం' అని వివరించారు. అభ్యర్థుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగుతుందని, ఆ తర్వాత తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు.

నూతన సంవత్సరంలో మంచి జరగాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : కొత్త సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలందరికి మంచి జరగాలని వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆకాంక్షించారు. మంగళవారం మండలంలోని వంజంగి పంచాయతీ బొర్రమామిడి గ్రామాన్ని ఆయన సందర్శించారు.స్థానిక గిరిజనులతో కలిసి ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. శంకులమ్మ గ్రామదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరిజనులతో సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. నవరత్నాల పథకాలతో ప్రతీ గిరిజనుడికి న్యాయం జరిగిందన్నారు.సంక్షేమ పథకాలు గడప వద్దకే అందాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని కోరారు. పాడేరు అసెంబ్లీకి పోటీ చేస్తున్న తనతో పాటు అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, సర్పంచ్‌లు వంతాల బొంజుబాబు, బసవన్నదొర, వంతాల రాంబాబు, ఎంపీటీసీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల పెళ్లి రాట


29వ వార్డు దిబ్బలపాలెంలో స్వామి వారి పెళ్లి రాట వేస్తున్న ముత్తయిదువులు


ప్రసాద్‌గార్డెన్స్ సీతారామ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద పెళ్లి రాట వేస్తున్న కమిటీ సభ్యులు

డాబాగార్డెన్స్ (విశాఖ) : మహారాణిపేట దిబ్బలపాలెంలో గత సీతారామచంద్రుల పెళ్లిరాట కార్యక్రమం కనువిందుగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం సీతారామ సేవా కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సేవా కమిటీ అధ్యక్షుడు చందక అప్పలరాజు మాట్లాడుతూ ఈ నెల 17న సీతారామ కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. కమిటీ ప్రతినిధులు పసగాడ రామలింగేశ్వరరావు, చందక ప్రభాకరరావు, శ్రీనివాసరావు, సోర్నపూడి సంజీవరావు, లక్ష్మణరావు (డాక్యుమెంట్ రైటర్), పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అలాగే పాతనగరం కోటవీధి రామాలయం, ఫిషింగ్ హార్బర్ రోడ్డు పెయిన్‌దొరపేట రామాలయం, చెంగల్రావుపేట, ఘోషాస్పత్రి వద్ద సీతారామస్వామి ఆలయం, వన్‌టౌన్ పప్పులవీధి రామాలయం, సూర్యాబాగ్ ఉమా రామలింగేశ్వరాలయం, గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వరాలయం, విశ్వనాథ్ రోడ్డులో గల ఓంకార ఆలయం, ప్రకాశరావుపేట రామాలయం, రామజోగిపేటలో గల రామాలయం, 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లో గల సీతారామ షిర్డీ సాయిబాబా మందిరంతో పాటు పలు రామాలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉగాది సందర్భంగా ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. ప్రసాద్‌గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్‌గాంధీ పాల్గొన్నారు.